ప్రజాశక్తి
సోమవారం 16 సెప్టెంబర్ 2024
5
కర్నూలు





కర్నూలులోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనానికి సాగనంపుతున్న మంత్రి టిజి. భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరుచరిత, పార్థసారథి, బొగ్గుల దస్తగిరి, నగర మేయర్ బివై.రామయ్య, జెసి బి.నవ్య, ఎస్‌పి బిందుమాధవ్ తదితరులు

బై బై గణేషా...

- కర్నూలులో ఘనంగా వినాయక నిమజ్జనం
- ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు - కిక్కిరిసిన వినాయక్ ఘాట్
- పోలీసుల పటిష్ట బందోబస్తు



వినాయక ఘాట్ వద్ద కెసి కెనాల్‌లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా కర్నూలులోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి, నిమజ్జనానికి సాగనంపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి. భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నగర మేయర్ బివై.రామయ్య, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఎస్‌పి బిందుమాధవ్ పూజలు నిర్వహించారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ సిరి సంపదలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని కోరారు.

గణనాథుడినికి తొమ్మిది రోజుల పాటు భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం రాంబొట్ల దేవాలయం వద్ద జరిగిన గణనాథుడి లడ్డు వేలం పాటలో లడ్డును రూ.2 లక్షల 32 వేలకు వరుసగా నాలుగోసారి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దక్కించుకున్నారు. రాంబోట్ల దేవాలయ విగ్రహాన్ని నిమజ్జనానికి సాగనంపారు. అనంతరం వినాయక ఘాట్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య జ్యోతి ప్రజ్వలన చేసి నిమజ్జనాన్ని ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి ధ్వజారోహణ చేశారు. కలెక్టర్ కార్యాలయం పరిపాలన వినాయకుడిని నిమజ్జనాన్ని జాయింట్ కలెక్టర్ నవ్య 3.30 గంటలకు చేశారు. అనంతరం ఎస్‌పి బిందు మాధవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరుచరిత, పార్థసారథి, బొగ్గుల దస్తగిరి, నగర మేయర్ బివై.రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌వి.మోహన్ రెడ్డి, హఫీజ్‌ఖాన్, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, గణేష్ ఉత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నగరఅధ్యక్షుడు మోక్షేశ్వరుడు నిమజ్జనం చేశారు. వారు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం పండుగ వాతావరణంలో కులమతాలకు అతీతంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. వినాయక నిమజ్జనం అట్టహాసంగా సాగింది. విగ్రహాలను మండపాల వద్ద నుండి వీధులలో ఊరేగించారు. బాణసంచా పేలుస్తూ మహిళలు సైతం నృత్యం చేస్తూ కోలాహలంగా గణేష్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను వినాయక ఘాట్ వద్దకు తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. 6 ఘాట్‌లలో 8 క్రేన్ ల సహాయంతో నిమజ్జనాన్ని చేశారు. ఘాట్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మత్స్య శాఖ ఆధ్వర్యంలో 8 తెప్పలతో 40 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటిని అందించారు. ఎప్పటి కప్పుడు చెత్తను శుభ్రం చేసేలా పారిశుధ్య కార్మికులతో చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా పోలీస్ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసి సిసి టివిల ద్వారా పర్యవేక్షించారు. రాత్రి 12 గంటల వరకు 1500 విగ్రహాల దాకా నిమజ్జనం చేశారు. నిమజ్జనం సోమవారం వరకు కూడా కొనసాగుతుందని ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కేంద్ర సమితి నాయకులు సుబ్రమణ్యం, సందడి సుధాకర్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజలు నిర్వహించి తొమ్మిదవ రోజువేలంపాట ద్వారా రూ.25 వేలకు నగర పాలక సంస్థ వినాయకుడి లడ్డును పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ దక్కించుకున్నారు. మేయర్ బివై.రామయ్య, కమిషనర్ పివి. రామలింగేశ్వర్ వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఊరేగింపు సందర్భంగా కార్యాలయ సిబ్బంది, కమిషనర్ పివి.రామలింగేశ్వర్ వినాయకుని ముందు చిందులు వేసి అందరినీ అలరించారు.

పాలన గణపతికి ప్రత్యేక పూజలు

కర్నూలు కలెక్టరేట్: కలెక్టరేట్లోని పరిపాలన గణపతికి ఇన్చార్జి డిఆర్ఓ చిరంజీవి, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరి ప్రత్యేక పూజలను నిర్వ హించారు. పాలనా గణపతితో నిమజ్జనానికి శ్రీకారం చుట్టారు. రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా : డిసిసి కార్యాలయం సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాగునీటి ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు ఎన్.సుంకన్న, సిటి కాంగ్రెస్ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, వంశీ, బాష పాల్గొన్నారు.

అన్నదానం: శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ సేవ సంఘం ఆధ్వర్యంలో వినాయక ఘాట్ దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. పలు సంస్థలు ప్రసాద వితరణ, నీటి పంపిణీ చేపట్టారు.



వినాయక ఘాట్ వద్దకు నిమజ్జనానికి ర్యాలీగా వస్తున్న విగ్రహాలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే తదితరులు

కల్తీ ఆహార నివారణే లక్ష్యం

- నిత్యం తనిఖీలు.. కల్తీ ఉన్నట్లు తెలిస్తే చర్యలు
- ఆహార ఉత్పత్తిదారులు ఫుడ్ స్టాండర్డ్స్‌ను పాటించాలి
- ప్రజాశక్తితో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కల్తీ ఆహారాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఆహార ఉత్పత్తితో మారుతున్న కొత్త పంథాలను ఉత్పత్తిదారులు అనుసరిస్తున్నారు. ఆహారంలో ఎలాంటి కల్తీ లేకుండా ప్రజలకు అందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. ఎవరైనా కల్తీ ఆహారాన్ని తయారు చేయడం, సరఫరా చేసి అమ్ముతూ చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ (ఎఎఫ్‌సి) కూర్మానాయకులు అన్నారు. ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

జిల్లాలో కల్తీ ఆహార నివారించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎఎఫ్‌సి : జిల్లాలో కల్తీ ఆహారాలను గుర్తించడానికి నిత్యం తనిఖీలను నిర్వహిస్తున్నాం. ఆహారాన్ని ప్రజలకు పరిశు భ్రంగా ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

కల్తీ ఆహారం అంటే ఏమిటి?

ఎఎఫ్‌సి : ప్రజలు తినే ఆహారం ఏదైనా వారి ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా తయారు చేసినా? లేదా సరఫరా చేసి అమ్ముతూ చేసినా అది నేరంగా పరిగణిస్తాం. అలాంటి ఆహారాన్ని కల్తీ ఆహారంగా పేర్కొంటాం. స్వల్పంగా ఆరోగ్యాన్ని కలిగించే ఆహార పదార్థాలు, తీవ్ర హాని కలిగించే లేదా ప్రాణాలు తీసే ఆహార పదార్థాలు ఆహార కల్తీలలో గుర్తిస్తాం. వాటి తీవ్రతను బట్టి తయారీదారులపై అమ్మకందారులపై కేసులను నమోదు చేస్తాం.

కల్తీలను నియంత్రించడంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని పట్ల మీ అభిప్రాయం ఏమిటి?..

ఎఎఫ్‌సి : ఆహారాన్ని నియంత్రించడంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సమగ్రంగానే విధులను చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు తమకు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తనిఖీలు నిర్వహిస్తున్నాం. బాధ్యులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

ఆహార తనిఖీల శాంపిల్స్ సేకరణకు ప్రభుత్వం ఏమైనా లక్ష్యాలు నిర్దేశించిందా?

ఎఎఫ్‌సి : నిజమే ఆహార తనిఖీల్లో భాగంగా ప్రతినెల 12 శాంపిల్స్ నమూనాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. లక్ష్యానికి అనుగుణంగా ప్రతినెల 12 శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపుతున్నాం. వచ్చిన ఫలితాలు ఆధారం చేసుకొని చర్యలకు పూనుకుంటున్నాం.

వాడిన నూనెను పదే పదే వాడకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రూకో విధానం ఏ విధంగా అమలవుతుంది?

ఎఎఫ్‌సి : హోటల్లో ఆహార పదార్థాల తయారీదారులు వంటల కోసం వాడిన నూనెను పదేపదే వినియోగించకుండా నియంత్రించడానికి రూకో విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దానికోసం జిల్లాలో ఏజెన్సీలను ఏర్పాటు చేసింది. ఈ ఏజెన్సీలు ప్రధానంగా వాడిన నూనెను సేకరించి నూనెకు ప్రతిఫలంగా సొమ్మును చెల్లిస్తారు. సేకరించిన నూనెను బయో డీజిల్ తయారీ కోసం వినియోగిస్తారు. ఒకరకంగా ఆహార కల్తీని నియంత్రించ డానికి ఇది ఉపయోగపడుతుంది.

ఆహార పదార్థాల షాపుదారులు వాటి నిర్వాహణ కోసం అనుమతులు ఏమైనా తీసుకోవాలా?

ఎఎఫ్‌సి : అవును తప్పనిసరిగా ఆహారాన్ని ఉత్పత్తి చేసే తయారీదారులు, అమ్మేవారు అనుమతులు తీసుకోవాలి. అందుకోసం ప్రత్యేకంగా ఫుడ్ సేఫ్టీ శాఖ ద్వారా లైసెన్సులు పొందాలి. పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహించేటట్టయితే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతి ఏడాది వీటిని రెన్యువల్ కూడా చేసుకోవాల్సి ఉంటుంది.



'కల్లుకుంట'ను కలెక్టర్, ఎస్‌పి సందర్శించాలి

- దళిత మహిళపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



బాధితురాలు గోవిందమ్మతో వివరాలు తెలుసుకుంటున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్‌పి సందర్శించాలని, దళిత గోవిందమ్మపై జరిగిన పైశాచిక దాడికి పాల్పడి చెట్టుకు కట్టేసి అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం దాడికి పాల్పడిన, ప్రేరేపించిన మానవ మృగాలను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా బృందం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోవిందమ్మను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, కెవి.నారాయణ, ఎమ్మిగనూరు సిపిఎం నాయకులు పి.గోవింద్, రాముడు, లక్ష్మీనరసయ్య, సురేష్, అబ్బుల్లా, వెంకటేశ్వర్లు, పెద్దకడబూరు సిపిఎం నాయకులు తిక్కన్నగౌడ్, వరపేష పరామర్శించారు. బాధితురాలును పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ బాధితురాలి గోవిందమ్మ కుమారుడు ఆరు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడని, ఆమె కుటుంబాన్ని వెలివేయడం దురదృష్టకర సంఘటన అన్నారు. ఆరు నెలల తర్వాత గ్రామానికి వచ్చిన బాధితురాలు గోవిందమ్మపై దాదాపు 50 మందిపైగా ఆమెను ఇంటి నుండి ఈడ్చుకు వెళ్లి ఒక విద్యుత్ స్తంభానికి కట్టేసి వివస్త్రను చేసి అవమానించడం సిగ్గుచేటని అన్నారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగడం పరిపాటిగా మారిందని, ఈ సంఘటనకు పాల్పడిన వారిని ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని తూతూ మంత్రంగా విచారణ చేసి కొంతమందిపై కేసు నమోదు చేసి కొంతమంది రక్షించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పరువు హత్యలు చేస్తున్నారని, ఇవన్నీ ఆగాలంటే సమగ్ర విచారణ చేసి అందరినీ కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ సంఘటన రోజే అక్కడ పోలీసులు స్పందించిన తీరు అభినందనీయ మన్నారు. ఈ గ్రామాన్ని జిల్లా ఎస్‌పి, కలెక్టర్ సందర్శించి లోతుగా అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

హమాలీ కార్మికుల సమగ్ర చట్టానికి పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హమాలీ కార్మికుల రక్షణకు సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లి, వాము పట్టుబడి హమాలి యూనియన్ (సిఐటియు) మహాసభ కార్మిక కర్షక భవన్‌లో పి. దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్, న్యూ సిటీ కమిటీ అధ్యక్షుడు ఆర్. నరసింహులు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా హమాలీ కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయన్నారు. పనిచేస్తూ ప్రమాదంలో మరణించినా పట్టించుకునే నాధుడే లేడని అన్నారు. హమాలీ కార్మికులకు రక్షణకు సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను పక్కనపెట్టి కార్మికులు పనిచేస్తున్న ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాబోయే కాలంలో హమాలి కార్మికులకు రక్షణకు సమగ్రమైన చటంకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మిక నేత ప్రజా నాయకుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ యార్డ్ ఉల్లి ,వాము కట్టుబడి హమాలి యూనియన్ గౌరవాధ్యక్షునిగా టి.రాముడు , అధ్యక్షులుగా పి.గౌస్ పీరా, కార్యదర్శిగా పి.చిన్నబడేసా, సహాయకార్యదర్శిగా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా పి. మౌలాలి, కమిటీ సభ్యులుగా ఇమ్మానుయేల్, మాబాష ,రామ్మోహన్, ప్రభాకర్, ఎల్లారాముడు, పెద్దబడేసా, లతీఫ్, నారాయణలను ఎన్నుకున్నారు. హమాలీ కార్మికులందరూ పాల్గొన్నారు.

లొద్దిపల్లె రోడ్లను బాగు చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెలోని బాలుర హాస్టల్‌ను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్.మధుసూదన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బాలుర హాస్టల్ , స్కూలు ఆవరణలో గ్రామంలోని మురుగు నీరంతా రోడ్డుపై ఎక్కి పారుతూ విద్యార్థులకు గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. విద్యార్థులు గ్రామస్తులు అటుగా వెళితే మురుగు నీళ్లలో కింద పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామ సచివాలయ అధికారులు అదే దారిలో వెళుతుంటారని, అయినా ఏమాత్రం స్పందించడం లేదన్నారు. మురుగునీటిని రోడ్డుపై పారకుండా తగుచర్యలు చేపట్టి విద్యార్థులు గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

సమాజ అభివృద్ధికి శ్రమిస్తున్న ఇంజనీర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమాజాభివృద్ధికి శ్రమిస్తున్న ఇంజనీర్లు అందరికి ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు ఐజెకె ఇంజనీరింగ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ టి.పద్మజ తెలిపారు. ఆదివారంస్థానికంగా బిర్లా కాంపౌండ్‌లో ఉన్న ఐజెకె ఇంజనీరింగ్ అకాడమీలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సర్‌మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని వేడుకలను జరిపారు. మేనేజింగ్ డైరెక్టర్ టి పద్మజ, గాయత్రీ ఎస్టేట్ సర్కిల్లోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పి ంచారు. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమాజ అభి వృద్ధికి పాటుపడుతున్న ఇంజనీరింగులకు శుభా కాంక్షలు తెలిపారు. అన్ని ఇంజనీరింగ్ శాఖలు వేటికవే ప్రత్యేకతను కలిగి ఉన్నాయని, అన్ని శాఖల కో ఆర్డినేషన్‌తో అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. ఇంజనీర్ల కృషితో మనిషి మనుగడ భూమిమీద మాత్రమే కాకుండా విశ్వాంతరాలలో కూడా విస్తరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. అటువంటి ఇంజనీర్లను తీర్చి దిద్దడంలో ఐజెకె ఇంజనీరింగ్ అకాడమీ ఎనలేని కృషి చేస్తున్నదని తెలిపారు. బిటెక్ , డిప్లమా ట్యూషన్స్ ఈసెట్ ,ఎంసెట్ , గేట్ ,ఐఐటి జెఇఇ కోర్సులు నిర్వహిస్తూ , వారి అభివృద్ధికి మంచి అనుభవం గల టీచింగ్ ఫ్యాకల్టీతో సెమిస్టర్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయి జాతీయస్థాయి ర్యాంకులను సాధిస్తున్నదని తెలిపారు .గేట్ ద్వారా విద్యార్థులను ఐఐటి అడ్మిషన్లు, ఈసెట్ ,ఎంసెట్ ద్వారా మంచి యూనివర్సిటీ ,పేరున్న ఇంజ నీరింగ్ కాలేజీలో అడ్మిషన్లు పొందామని తెలి పారు. మంచి ఇంజనీర్లు తయారు చేయడంలో ఇంజ నీరింగ్ కాలేజీల పాత్ర చాలా ఉందని, అందుకు మా అకాడమీసపోర్ట్ చేస్తుందని తెలిపారు. అకాడమీ మేనేజర్ పరశురాములు, వైస్ ప్రిన్సిపల్‌స్వాములు ,విద్యార్థులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

గుండె వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ గుండె వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచించారు. ఆదివారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో శ్రీచక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని టిడిపి నాయకులు జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డి.రామాంజనేయులు, గ్రామ నాయకులు ఇవి రమణ, రంగ స్వామి రెడ్డి, కల్లూరు మండల నాయకులు మాధేష్, దనుంజయ, వెంకటేశ్వర్లు, కరీం, కలాం, ఇద్దం శ్రీకాంత్, జనసేన నాయకుడు రాకేష్, సంబధిత హాస్పిటల్ డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: పద్మానందయోగి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యోగా ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం వస్తున్నదని ప్రజా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు పద్మానంద యోగి అన్నారు. నగర శివారులోని జగన్నాథ గట్టు దగ్గర పద్మానంద ఆశ్రమంలో ఆదివారం యోగా, ధ్యానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మానందయోగి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే అనారోగ్య కారణంగా రోగాల బారి నుండి, పని ఒత్తిడివల్ల గుండె జబ్బులు కలిగే అవకాశం ఉంటుందన్నారు. కర్నూలు నగరంలో వున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమం ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఈ కార్య క్రమంలో ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.బలరాం , శ్రీరాములు, సూరి, శివమణి, ఈశ్వర్ చంద్ర, రవికుమార్ ,మోహన్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన సామాన్యుల గొంతుక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సామాన్యుల గొంతుక మూగబోయిందని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్, ఓల్డ్ సిటీ కార్యదర్శి సి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు ఓల్డ్ సిటీ శాఖ ఆధ్వర్యంలో సూర్యితీ భవనంలో ఓల్డ్ సిటీ అధ్యక్షులు సి. జయమ్మ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభను ఏర్పాటు చేశారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈశ్వరమ్మ, పుష్ప ,పకీరమ్మ, నరసమ్మ మహిళలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి కి ఘన నివాళి

కర్నూలు నగరంలోని 23వ వార్డులోని శ్రీరామనగర్ శ్రీ చైతన్యస్కూల్ దగ్గర సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సిపిఎం నగర నాయకులు సి.శేషాద్రి అధ్యక్షత వహించారు. జోహార్ సీతారాం ఏచూరి, రెడ్‌సెల్యూట్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూఘనంగా నివాళులర్పించారు. వార్డు పెద్దలు వై.నగ్గన, జి.రత్నం, ఎం. నాగరాజు, వై.నవరాత్నమ్మ,కె.ఈశ్వరయ్య,ఆర్.ఒబులేసులు, సీతారాంఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు సిహెచ్.సాయిబాబా మాట్లాడారు. సిపిఎం వార్డు నాయకులు ఎస్.ఇబ్బత్ లక్ష్మన్న, బి.రామ్, ఆంజనేయులు, పెద్దల చిట్టిబాబు, కె.ప్రతాప్, సత్యాలు, కె.మల్లికర్, కె.మద్దిలేటి, కర్తార్, వి.రాజు, జి.వెంకటేశ్వర్లు, బి.బాలన్న, నాగన్న పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి చిత్రపటానికి చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి.అంజిబాబు, నగర కార్యదర్శి ఎస్ సాయిబాబా, చిన్న వ్యాపారస్తుల సంఘం న్యూ బస్టాండ్ కార్యదర్శి ఎస్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సీతారాంకు నివాళి అర్పిస్తున్న నేతలు



సీతారాం ఏచూరికినివాళి అర్పిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు డిఎస్ఎ అవుట్ డోర్ స్టేడియంలో 9వ రాష్ట్రస్థాయి జూనియర్ అట్యా పట్యా పోటీల ముగింపు సందర్భంగా డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి, డాక్టర్ బిఎస్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ సి.వాసు రెడ్డి, కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు, కర్నూలు జిల్లా నెట్ బాల్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వర బాబు, కర్నూలు జిల్లా అట్యా పట్యా సంఘం అధ్యక్షుడు ఐ.నాగరత్నమయ్య, కర్నూలు జిల్లా అట్యా పట్యా సంఘం కార్యదర్శి బాల పవన్ బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల్ని, వ్యాపారస్తుల్ని ఆ ప్రాంతం వరకే గుర్తించుకుంటారని, క్రీడాకారులను ప్రపంచమంతా గుర్తిస్తుందని అన్నారు. ఈ పోటీలలో కర్నూలు జిల్లా జట్టు బాల బాలికల విభాగంలో తతీయ స్థానం సాధించింది. విలువిద్య శిక్షకుడు బాలాజీ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సుప్రియ, గీతాంజలి, నాగమణి, వెంకటలక్ష్మి, లీలావతి, రాజేశ్వరి, సునంద, లావణ్య, చంద్రకళ, విజయభాస్కర్ రెడ్డి, రాజశేఖర్, నెట్ బాల్ జాతీయ క్రీడాకారుడు చరణ్, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



దళిత మహిళను హింసించిన అందరిపై కేసు నమోదు చేయాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

పెద్దకడుబూరు మండలం, కల్లకుంట గ్రామంలో సామాజిక హింసకు పాల్పడిన అందరి పైన కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం ఆధిపత్య కులాల చేతిలో బట్టలూడదీసి, కరెంటు స్తంభానికి కట్టేసి విచక్షణా రహిత దాడికి గురైన మాదిగ గోవిందమ్మను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎండి. ఆనంద్‌బాబు కెవిపియస్ ప్రతినిధి బృందంతో కలిసి పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ సభ్య సమాజం తలగించుకునేలాంటి ఘటన కర్నూలు జిల్లాలో జరిగితే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ఘటన ప్రాంతాన్ని సందర్శించకపోవడం దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం జరిగిన కులాంతర వివాహాన్ని ఆధారంగా చేసుకుని అప్పుడే పెళ్లి చేసుకున్న అమ్మాయి అబ్బాయిని పోలీసుల సమక్షంలోనే గ్రామ బహిష్కరణ చేశారన్నారు. గ్రామ పెద్దలు, కులాంతర వివాహం చేసుకున్న మాదిగ ఈరన్న తల్లిగోవిందమ్మ సెప్టెంబర్ 12న గ్రామానికి రావడాన్ని జీర్ణించుకోలేని ఆధిపత్య కులాలు గోవిందమ్మను నిర్బంధించి, బట్టలూడదీసి కరెంటు స్తంభానికి కట్టి విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. సరైన సమయంలో స్పందించి గోవిందమ్మ ప్రాణాలు పోకుండా కాపాడినందుకు పోలీసులకు ధన్యవాదాలన్నారు. సెప్టెంబర్ 12న రాత్రి 10 గంటలకు గోవిందమ్మను తీసుకెళ్లిన పోలీసులు సెప్టెంబర్ 13న సాయంత్రం 3:30 దాకా కేసు నమోదు చేయకపోవడం వెనక ఉండే మతలబు ఏమిటని ప్రశ్నించారు. గ్రామంలో కులఅహంకారంతో పెత్తనం చెలాయించే అసాంఘిక ఆధిపత్య శక్తులు అయిన తెలుగు కృష్ణమూర్తి, బోయ చిలకళడోన లక్ష్మన్న, తెలుగు నరసప్ప, బోయ బసవరాజు, తెలుగు ఎర్రన్న, నర్సింగప్ప, లచ్చుమారి తిక్కప్ప, చిలకళడోన దేవేంద్ర, బోయ నాగేంద్ర, చిన్న నాగేంద్రతో పాటు మరో 20 మంది ఘటనలో ప్రత్యక్షంగా భాగస్వామ్యం అయినా వారిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా కేవలం చాకలి కులస్తులపై కేసు నమోదు చేసి ఇరుకుటుంబాల ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం చేశారన్నారు. ఇది చట్టభద్దంగానే కుల అంతరాలను ప్రోత్సహించడం అన్నారు. ఘటన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్,ఎస్పి సందర్శించాలన్నారు. ఘటనలో పాల్గొన్న అందరిపై కేసు నమోదు చేయించి, అరెస్టు చేయించాలన్నారు. గోవిందమ్మకు ప్రత్యేక భద్రతతో కూడిన మెరుగైన వైద్యం అందించాలన్నారు. లేనిపక్షంలో కలిసొచ్చే సంఘాలన్నిటిని కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామన్నారు. గోవిందమ్మను పరామర్శించిన కెవిపిఎస్ ప్రతినిధి బృందంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు తిమ్మన్న, చిన్నప్ప, పట్టణ కార్యదర్శి అంథోని, మంత్రాలయం మండల కార్యదర్శి అంజి, నాయకులు సురేష్, నందవరం మండల నాయకులు నరసింహులు, ఎమ్మిగనూరు నాయకులు రాజు, గుంటెప్ప, ఆనందరావు, రాజా రమేష్, కుర్నేలు, ప్రసాద్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.



బాధిత మహిళను పరామర్శిస్తున్న కెవిపిఎస్‌నాయకులు ఆనంద్‌బాబు, తదితరులు

అర్ధాంతరంగా ఆగిన నాడు నేడు పనులు

ఏడాదిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణము విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-ఆస్పరి

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరగాలని ఎంతగానో కృషి చేశారు. అందులో భాగంగానే నాడు-నేడు కింద తరగతి గదులు మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మాణానికి కోట్లాదిరూపాయలు ఖర్చు చేశారు. నాడు-నేడు కింద ఆస్పరి మండలంలో అదనపు గదులు మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వంలో కొంతమేర పనులు జరిగినా ఏడాది నుంచి పనులు ఆగిపోయాయి. అర్ధాంతరంగా నిలిచి పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పరి జడ్‌పి హెచ్ పాఠశాలలో మూడు గదులు, కెజిబివి పాఠశాలలో నాలుగు గదులు నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు స్లాబ్ వరకు పూర్తి చేశారు. తంగరడోనలోని ఐదు గదులు డోర్ లెవెల్ నుంచి ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. పాఠశాల ఉపాధ్యాయులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తంగరడోణ జడ్‌పిహెచ్ పాఠశాలలో 3 నుండి 10 వతరగతి వరకు 570 మంది విద్యార్థులు, ఆస్పరి జడ్పీహెచ్ పాఠశాలలో 3 నుండి 10 వతరగతి వరకు 820 మంది విద్యార్థులు, ఆస్పరి కెజిబివి పాఠశాలలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు 272 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంటర్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కూడా లేదు. 3,4,5 తరగతులను జడ్‌పిహెచ్ పాఠశాలలో విలీనం చేయడం వల్ల గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు కింద ఫేస్ టు లో తంగరడోన లోని జడ్‌పిహెచ్ పాఠశాలలో 11 గదులు ప్రపోజల్ పంపించగా 9 గదులకు రూ.కోటి 13 లక్షలు మంజూరు చేశారు. కాకపోతే ప్రస్తుతానికి 5 తరగతి గదులకు రూ.45 లక్షలు ఖర్చు అయింది. 9 గదులు పూర్తి కావాలంటే రూ.68 లక్షలు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయుడు కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఆస్పరి జడ్‌పిహెచ్ పాఠశాలలో ఐదు గదులకు ప్రపోజల్ పంపించగా 3 గదులకు రూ.37 లక్షలు కేటాయించగా రూ. 23 లక్షల మాత్రమే మంజురయ్యాయని, గదులు పూర్తి కావాలంటే ఇంకా రూ.14 లక్షలు మంజూరు కావాల్సి ఉందని ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి తెలిపారు. ఆస్పరి కెజిబివి పాఠశాలలో ఐదు గదులకు ప్రపోజల్ పంపించగా 4 గదులకు రూ.48 లక్షలు మంజూరు చేసింది. రూ.25.50 లక్షలు మంజూరయ్యాయి. గదులు పూర్తి కావాలంటే 22.50 లక్షలు రావాల్సి ఉందని కెజిబివి ప్రిన్సిపల్ షేరన్ స్మిలే పేర్కొన్నారు.



అర్ధాంతరంగా ఆగిపోయిన పాఠశాల భవనం

నిధులు మంజూరయితే పనులు ప్రారంభిస్తాం: ఎంఇఒ-2 తిరుమలరావు



నాడు-నేడు కింద మొదటి ఫేస్‌లో మంజూరైన ఆస్పరి జడ్‌పిహెచ్ పాఠశాలలో 3, కెజిబివి పాఠశాలలో 4, తంగరడోన లోని 7 గదులకు నిధులు లేక మధ్యలోనే నిర్మాణం పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరు కోసం జిల్లా ఉన్నంత అధికారులకు నివేదిక పంపాం.నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

పంజా విసురుతున్న విషజ్వరాలు

మంచాన పడుతున్న వృద్ధులు,చిన్నారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎక్కడచూపినా జ్వరం, ఒళ్లునొప్పులతో జనం అల్లాడిపోతున్నారు. గ్రామాలకు గ్రామాలు మంచాన పడుతున్నాయి. పల్లెనుంచి పట్నం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో బాధితులు అధికమవుతున్నారు. వారంతా వైద్యం కోసం ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. పల్లెల్లో పలు చోట్ల పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దోమల దాడి కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాపిస్తుండటం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు డెంగ్యూ ఫీవర్ పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ప్రధానంగా డెంగీ లక్షణాలతో మండల పరిధిలో మండిగిరి, పెద్దతుంబలం, పెద్దహరిహణం, దేవనకొండ మండలం తేర్నేకల్, కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి వివిధ ప్రయివేట్ ఆస్పత్రులలో డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలతో చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మంచం పట్టారు. మరోవైపు ఆస్పత్రుల నిర్వాహకులు అధిక మొత్తంలో ఫీజులతో పాటు డెంగ్యూ పేరుతో అన్ని రకాల రక్త పరీక్షలు చేసి రోగుల వద్ద వేలల్లో వసూలు చేస్తున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, ప్లేట్లెట్స్ కౌంట్ తోపాటు మరిన్ని పరీక్షలు చేయించుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు. కొద్దిపాటి జల్లులకే గ్రామాల్లోని కాలువల్లో ఉన్న మురుగు రోడ్లమీద ప్రవహిస్తోంది. మరోవైపు దోమల ఉధృతి పెరిగింది. ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం అరకొర చర్యలు మాత్రమే చేపడుతోంది.



ఆస్పత్రి వద్ద బారులు తీరిన రోగులు

ఆటలతోనే మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-ఆదోని

ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రోటరీక్లబ్ అధ్యక్షుడు కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైపుల్లా తెలిపారు. ఆదివారం ఆదోని మల్లికార్జున విద్యాలయ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఇండోర్ ఆటల పోటీల్లో జోనల్ స్థాయిలోని 50 పాఠశాలల నుండి వెయ్యి మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మల్లికార్జున విద్యాలయ కరస్పాండెంట్ సుగూరప్ప, అడ్వైజరి మెంబర్ విశ్వనాథ్‌రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. క్రీడలు పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు దృఢత్వాన్ని పెంచుతాయని అన్నారు. ఇండోర్ ఆటల పోటీల్లో చెస్, డ్రాయింగ్, రూబిక్ క్యూబ్, క్విజ్, ఎలిక్యులేషన్ పోటీలను నిర్వహించారు. డ్రాయింగులో కిడ్డీస్ రూట్స్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న అనన్య మొదటి స్థానాన్ని, రెండవ, మూడవ స్థానాలను అక్షర శ్రీ పాఠశాల విద్యార్థిని రిహాహుస్సేన్, భాష్యం పాఠశాల విద్యార్థిని విష్ణుసాయి సాధించారు. క్విజ్, చెస్, ఎలిక్యూషన్, రూబిక్ క్యూబ్స్‌లలో ప్రతిభను కనబరిచిన ఆయా పాఠశాలల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ప్రశంసా పత్రంతోపాటు మెడల్స్ రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. రోటరీక్లబ్ స్పోర్ట్స్‌లో పాల్గొని న్యాయ నిర్నేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ యూత్ ఆక్టివిటీస్ ఇంచార్జి సాబీర్ అహ్మద్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, భరత్ షా, విట్టా మురళీధర్, రాయచోటి సుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, బసవరాజు, ఉమేష్ పాయి, వీరేష్‌స్వామి, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, విట్టారాజేష్, శివరాం, హుస్సేన్ బాష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న రోటరీ క్లబ్ నాయకులు, క్రీడల నిర్వాహకులు

నేటితరం ఇంజనీర్లకు మోక్షగుండం ఆదర్శం

ప్రజాశక్తి-ఆదోని: నేటి తరపు ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఆదర్శం, మార్గదర్శకమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ కొనియాడారు. భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని వారి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఇంజనీరుగా సేవలు అందించిన పంచాయతీరాజ్ రిటైర్డ్ ఇంజనీరు మల్లికార్జున గౌడ్‌ను పూలమాలు, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైసూర్ వద్ద కెఎస్ఆర్ బ్యారేజీని, నిర్మించడం, తిరుమల కొండలకు మొదటి రహదారి మార్గాన్ని నిర్మించడంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారన్నారు.లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి,కార్యదర్శి వంక దారు శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి శంకరమ్మ,విశిష్ట సభ్యులు వనపరాజు , మల్లికార్జున గౌడ్ , అవోపా నుండి వెంకటేశ్వర్లు రఘు ఉన్నారు




రిటైర్డ్ ఇంజనీర్ మల్లికార్జున గౌడ్‌నుసన్మానిస్తున్న లైన్స్‌క్లబ్ నిర్వహకులు

శ్రీసాయి వికలాంగుల సమైక్య మండలాధ్యక్షునిగా జె వీరేష్

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం శ్రీ సాయి వికలాంగుల సమైక్య మండలాధ్యక్షునిగా జెట్టప్ప గారివీరేష్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి రామంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వికలాంగులు శ్రీ సాయి సమైక్య మాజీ అధ్యక్షులుగా ఉన్న కమ్మరచేడు గ్రామానికి చెందిన బసవతాత మాట్లాడుతూ అంగవైకల్యం మన శరీరానికే తప్ప ఆత్మస్థైర్యాన్నికి కాదని తెలిపారు. సమస్య ఏదైనా ధైర్యంతో ఎదుర్కోవాలని సూచించారు. గౌరవ అధ్యక్షులు వాల్మీకి రామాంజనేయులు మండల సమాఖ్య కోశాధికారిగా ఉన్న జెట్టప్పగారి వీరేష్ ను నూతన వికలాంగుల మండల అధ్యక్షునిగా ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ సంఘం కోసం సభ్యుల సమస్యలపై అందుబాటులో వుండి పరిష్కారానికి కషిచేస్తానని తెలిపారు. సెక్రటరీగా మనేకుర్తి గ్రామానికి చెందిన మహదేవమ్మ , కోశాధికారిగా మొలగవల్లి గ్రామానికి చెందిన గంగన్న గారి నౌనేపాటి ఈసీ నెంబర్లు ఆరు మంది సభ్యులను కొత్త కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆ తెలిపారు.అనంతరం కొత్త కమిటీ సభ్యులను శాలువాతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రెడ్ఆర్‌డి వర్కర్, వాలంటీర్ రమేష్, రాజు, నాయకులు హత్తిబెలగల్ గోవిందు, ఏకాంబరెడ్డి, మరకట్టునాగరాజు, కమ్మరచేడు మంగన్న, సభ్యులు మనేకుర్తి వెంకట లక్ష్మీ, హత్తి బెలగల్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.





అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న చిప్పగిరి లక్ష్మీనారాయణ

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చిప్పగిరి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ఐకమత్యంతో ముందుకు తీసుకెళ్దామని రాయలసీమ జిల్లాల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఆలూరు ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు కత్తి రామాంజనేయులు అన్నారు. ఆదివారం రామదుర్గం గ్రామంలో సర్పంచి దంపతులు రోహిణి, వీరప్ప ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి నాయకుల చేత భూమి పూజ చేయించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను, ఆయన చూపించిన దారి యువత ఎప్పటికి కూడా మరువకూడదన్నారు. వారు రచించిన రాజ్యాంగం వలనే ఈనాడు మనందరికీ కూడా ఒక గౌరవం, హోదా దక్కిందన్నారు. అయినప్పటికీ ప్రతి రాష్ట్రంలో కూడా దళితులను చిన్న చూపు చూస్తూ దాడులు చేస్తున్నారన్నారు. అణిచివేతకు గురవుతున్నామన్నారు. అధికారంలో ఉన్నవారు ఒక ఓటు బ్యాంకు గాని చూస్తున్నారని, దళితులకు ఉపయోగ పడే నిర్ణయాలు ఏ ప్రభుత్వం కూడా తీసుకోలేక కాలయాపన చేస్తున్నాయన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి కూడా చేయి చేయి కలిపి త్వరగా పూర్తి చేయాలన్నారు. డివిజన్ నాయకులు ఎల్లప్ప, చంద్ర, దుగ్గప్ప, కరెంటు గోవిందు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీరాములు డిమాండ్

ప్రజాశక్తి ఆదోని



అసంపూర్తిగా ఉన్న ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని, వైద్యవిద్య ను ప్రైవేటీకరణ చేసే నిర్ణయంను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 -25 విద్యా సంవత్సరం నూతన మెడికల్ కళాశాలను నడపలేమని ఎన్ఎంసికి ప్రభుత్వం లేక రాయడం దౌర్భాగ్య చర్య అని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఐదు మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించి 700 సీట్లు భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఏడు మెడికల్ కళాశాలల పనులను నిలిపివేయడం సమంజసం కాదన్నారు. మెడికల్ కళాశాలలో పనులను పునఃప్రారంభించాలని, లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

ప్రజాశక్తి -మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. శని, ఆది, సోమవారాలు సెలవు రోజులు కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లక్షల్లో భక్తులు తరలి రావడంతో శ్రీ మఠంతో పాటు ప్రధాన రహదారిలో వాహనాలతో పాదాచారులతో కిక్కిరిసి పోయింది. శ్రీ మఠం అద్దె గదులు డోనర్లతో భక్తులతో నిండిపోవడం వల్ల ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించి తమ జేబులను ఖాళీ చేసుకున్నారు.







సూక్ష్మకళతో సుద్ద ముక్క చంద్రయాన్-3

ప్రజాశక్తి-మంత్రాలయం

సూక్ష్మ కళతో సుద్ద ముక్కతో చంద్రయాన్-3 మిస్సైల్ చెస్‌కింగ్‌లను తయారు చేసి సూక్ష్మ కళాకారిణి విద్యార్థిని తన ప్రతిభను చాటుకున్నది. మంత్రాలయం శ్రీ వైష్ణవి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న యర్రంపల్లి ముకుంద ప్రియ సూక్ష్మ కలలో తన ప్రతిభను కనబరిచింది. సుద్దముక్క (చాక్పీస్) పై చంద్రయాన్ - 3 మిస్సైల్, చేస్ బోర్డులోని రాజు(కింగ్) బొమ్మలను చెక్కింది. వీటితోపాటు పేర్లను(నేమ్స్) చెక్కుతుంది. చదువుకుంటూనే సూక్ష్మ కళలో తన ప్రతిభను కనబరుస్తూ తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందనలు పొందింది. తల్లిదండ్రులు వై. మల్లికార్జున, సుజితలు బిడ్డ ప్రతిభను చూసి ఆనంద పడ్డారు. భవిష్యత్తులో మరింత ప్రతిభను చూపడానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

పేద విద్యార్థికి బుట్టారేణుక ఆర్థికసాయం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

బుట్టా ఫౌండేషన్ ద్వారా మెరిట్ విద్యార్థి అయిన గోనెగండ్ల మండలం ఐరన్ బండ గ్రామానికి చెందిన పి.పాండురంగకు లా ఫీజు రూ.15,000 వైసిపి ఎమ్మిగనూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి బుట్టా రేణుక ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు మెరిట్ సాధించి చదవలేని అనేక మంది విద్యార్థులకు ఫీజులు కట్టి ఉన్నత చదువులు చదవడానికి బుట్టా ఫౌండేషన్ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.



వర్షాలతో మొలకెత్తిన వేరుశనగ

సంగాలలో 70 ఎకరాలలో తీవ్రనష్టం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ సంగాలలో వేరుశనగ రైతులకు తీవ్ర నష్టాలను తెచ్చిపెట్టింది. గతేడాది అనావృష్టి కారణంగా పంటలు తెబ్బతిన్నాయి. ఈ ఏడాది తరచూ కురుస్తున్న వర్షాలతో అతివృష్టి ఫలితంగా చేతికొచ్చిన వేరుశనగకు మొలకలు వచ్చాయి. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టిన రైతన్న నష్టాలతో కుదేలు అవ్వక తప్పడం లేదు.ఏటా పెట్టిన పెట్టుబడులతో పంటలు చేతికందక పోగా అప్పుల ఊబిలో కూరుకొని జీవితాలు అగమ్యగోచరంగా మారింది. ఈ ఏడాది అన్నీ పంటలు చేతికొచ్చే వేళ ఆశలను నిరాశ పరిచాయి. చేసేదేమి లేక సంగాలలో రైతులు సుమారు 19 మంది 70 ఎకరాలలో వేశామని ఆందోళన చెందుతున్నారు.

భారీగా తగ్గిన వేరుశనగ దిగుబడి ,నాగన్న రైతు సంగాల



ఈ ఏడాది కాలం కలిసోచ్చిందని మూడు ఎకరాలలో వేరుశనగ సాగు చేశాం. అయితే ఎకరాకు లక్ష పెట్టుబడి పెట్టినా కేవలం నాలుగు క్వింటాలు మాత్రమే అయ్యాయి. 30 నుండి 40 క్వింటాళ్ల కావాల్సి ఉండగా వర్షాల కారణంగా దిగుబడి భారీగా తగ్గింది.

నిరాశ పరిచిన అతివృష్టి, జమ్మన్న రైతు సంగాల



ఈ ఏడాది వేయి ఆశలతో పంటలు సాగుచేశాం. వేరుశనగ పంట గత మూడు వారాల క్రితం వరకు దిగుబడులపై ఆశాజనకంగా ఉండేది. ప్రస్తుతం తీవ్ర వర్షాల కారణంగా వేరుశనగకు మొలకలు వచ్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దిగుబడులు నిరాశపరిచాయి.




రాఘవేంద్రరెడ్డికి విరాళం డబ్బులు అందజేస్తున్న టిడిపి మండల నాయకులు

వరదభాదితులకు రూ. 1.7 లక్షల విరాళం

ప్రజాశక్తి- పెద్దకడబూరు

విజయవాడ వరదభాదితులకు పెద్దకడబూరు మండల టిడిపి కమిటీ నుంచి రూ. 1,71,700 సేకరించినట్లు టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న తెలిపారు. ఆదివారం ఆయన మండల టిడిపి నాయకులతో కలిసి మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ ఎన్.రాఘవేంద్రరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల వలన విజయవాడ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలమేరకు సాటి మనుషులకు అండగా ఉండాలనే సంకల్పంతో మండలంలోని వివిధ గ్రామాల టిడిపి నాయకులు విరాళాలు సేకరించినట్లు వెల్లడించారు. టిడిపి నాయకులు ఏసేపు, విజయ్ కుమార్, రామాంజి, కంపాడు మునెప్పు, మల్దకల్, చంటి, జాలవాడీ యంకన్న, నరసయ్య వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



పొక్లెయినర్ సహాయంతో బండరాళ్లను తొలగిస్తున్న అధికారులు

హంద్రీనీవా నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-చిప్పగిరి

హంద్రీనివా కాలువ నుండి ఆలూరు బ్రాంచ్ కాలువకు నీటి విడుదలలో ఉన్న అడ్డంకులను అదగమిస్తూ.. ప్రభుత్వ అధినేతల అనుమతితో, ఆదివారం గుంతకల్, ఆలూరు స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో నీటి విడుదల పైపులకు అడ్డంకిగా ఉన్న బండరాళ్ళను తొలిగిస్తూ ఆలూరు బ్రాంచ్ కాలువకు పలు గ్రామాలకు చెందిన సంబంధిత రైతులు నీటిని విడుదల చేయడానికి ముందుకొచ్చారు. చిప్పగిరి మండల రైతుల తరుపున నీటి విడుదలకు సహకరించిన ప్రభుత్వ అధినేతలకు , గుంతకల్, ఆలూరు ప్రజాప్రతినిధులకు, ఇరిగేషన్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని రైతులు తెలిపారు.